# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు**

నిజామాబాద్ స్పోర్ట్స్/ బాన్సువాడ, అక్టోబర్ 18 : ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో పలు నియోజకవర్గాల్లో అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి బుధవారం పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బోధన్ పట్టణంలో పర్యటించడంతోపాటు బాన్సువాడ నియోజకవర్గంలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నూతనంగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూం తదితర వాటికి ఆయా కేంద్రాల్లో ఏ మేరకు పరిస్థితులు అనువుగా ఉన్నాయో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు భద్రతాపరమైన అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట బోధన్, బాన్సువాడ ఆర్డీవోలు రాజాగౌడ్, భుజంగరావు తదితరులు ఉన్నారు.


బాన్సువాడ ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి

## 22న విజయదశమి మహోత్సవం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 18 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ -ఇందూరు ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఉదయం 7 గంటలకు విజయదశమి మహోత్సవం నిర్వహించనున్నట్లు నగర సంఘచాలక్ టి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గుర్బాబాదిరోడ్‌లో ఉన్న అక్షరధామ్ హైస్కూల్లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది దేవీదాస్ చండాక్, వక్తగా వరంగంటి శ్రీనివాస్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 21న సద్దుల బతుకమ్మ

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 18 : సద్దుల బతుకమ్మ పండుగను ఈనెల 21న జరుపుకోవాలని ప్రముఖ సిద్ధాంతి ప్రశాంత్ జోషి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా ఈ నెల 22న జరుపుకోవాలని నిర్ణయించినా.. బతుకమ్మను ఆడపడుచుగా భావించి పంపడం సరికాదని భావించి, ఈ నెల 21న జరుపుకోవాలని నగరంలోని పండితులు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి.

## 21న భవానీమాత ర్యాలీ

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 18 : ఈనెల 21వ తేదీ సాయంత్రం భవానీ మాత ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇందూరు భవానీ ర్యాలీ వ్యవస్థాపక అధ్యక్షుడు పబ్బ సాయిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోచమ్మగల్లీ నుంచి దేవీరోడ్‌లోని దేవి మందిరం వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి భవానీమాత ర్యాలీని జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మాలధారులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

## ఆర్టీసీ ఆధ్వర్యంలో 'లక్కీడ్రా' బాక్సుల ఏర్పాటు


లక్కీడ్రా బాక్సులో టికెట్లు వేస్తున్న ప్రయాణికులు

ధర్పల్లి, అక్టోబర్ 18 : మండలకేంద్రంలోని నూతన బస్టాండ్‌లో లక్కీడ్రా బాక్సులను ఆర్టీసీ కంట్రోలర్ సబ్బని గంగాధర్ బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిని ప్రోత్సహించేందుకు బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బస్సుల్లో ప్రయాణం చేసిన వారు బస్సు టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నంబర్ రాసి లక్కీడ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 30 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. లక్కీడ్రాలో గెలుపొందిన వారికి ఆర్టీసీ రీజియన్ల వారీగా స్త్రీలు, పురుషులు ఐదుగురి చొప్పున రూ.9,900 అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆడిట్ రికార్డులను సిద్ధం చేయాలి

■ డీఆర్డీవో చందర్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో చందర్‌నాయక్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 18 : ఆడిట్ రికార్డులను సిద్ధం చేయాలని డీఆర్డీవో చందర్‌నాయక్ అన్నారు. మోపాల్ మండలంలోని ఉపాధిహామీ సిబ్బంది, క్షేత్ర సహాయకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు రికార్డులను సిద్ధం చేసుకోవాలని, జాబ్ కార్డ్ అప్‌డేట్ ఎప్పటికప్పుడు చేయాలని, రికార్డులు, ప్లాంటేషన్ రిజిస్టర్ల మెయింటెనెన్స్ సరిగ్గా ఉండాలని అన్నారు. సోషల్ ఆడిట్ టీముకు సహకారమందించాలని సూచించారు. ఎంబీల్లో సంతకాలు పూర్తిచేసి ఆడిట్‌కు రికార్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు. గత ఏడాదితో పోలిస్తే 2023-24 సంవత్సరం మాన్‌డేస్ చాలా తక్కువగా నమోదైనట్లు తెలిపారు. అనంతరం బాడ్సి గ్రామపంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సంపద వనాలను సందర్శించారు. సమావేశంలో ఎంపీడీవో లింగంనాయక్, ఎంపీవో మహ్మద్ ఇక్బాల్, అహ్మద్, ఏపీవో సునీత, ఈసీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల పరిశీలన

ధర్పల్లి, అక్టోబర్ 18 : నవంబర్ 30న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని దుబ్బాక గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్‌కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్ల వద్ద ఏర్పాటు చేయాల్సిన బందోబస్తుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ధర్పల్లి సీఐ సైదా, ఎస్సై వంశీకృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.


దుబ్బాకలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్ కుమార్

## బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు


బ్యాలెట్ బాక్స్‌లను తరలిస్తున్న సిబ్బంది

ఖలీల్‌వాడి, అక్టోబర్ 18 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఉపయోగించబడే బ్యాలెట్ బాక్స్‌లను పాలిటెక్నిక్ కళాశాల నుంచి తరలిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారిణి జయసుధ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికలకు సంబంధించిన పనులను నిర్వహించనున్న నేపథ్యంలో.. కలెక్టర్ ఆదేశాల మేరకు బ్యాలెట్ బాక్సులను సుభాష్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఉన్న షెడ్డుకు తరలిస్తున్నట్లు చెప్పారు. బుధ, గురువారాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పోలీసు సంరక్షణతో బ్యాలెట్ బాక్స్‌లను తరలించి, భద్రపర్చనున్నట్లు ఆమె తెలిపారు.

## గోశాలకు బోరుమోటరు వితరణ

చందూర్, అక్టోబర్ 18 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శివయ్య గోశాలకు చందూర్‌లోని విఘ్నేశ్వర కాలనీకి చెందిన జగ్గారి శ్రీనివాస్‌రెడ్డి బోరుమోటరును వితరణ చేశారు. నీటి సౌకర్యం కోసం రూ.40 వేల విలువ చేసే బోరుమోటరును బుధవారం వితరణ చేశారు. గోశాల కమిటీ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వరప్రసాద్, జగ్గారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నల్లవెల్లిలో బీఆర్ఎస్ నాయకుల సమావేశం

**వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి చొప్పున నియామకం**


డీసీఎంఎస్ చైర్మన్‌కు ఇన్‌చార్జుల వివరాలను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇందల్వాయి, అక్టోబర్ 18 : మండలంలోని నల్లవెల్లిలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో గ్రామంలోని వంద ఓటర్లకు ఒక ఇన్‌చార్జి చొప్పున 38 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపే లక్ష్యంగా కృషిచేయాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, గ్రామశాఖ అధ్యక్షులతోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం

బాన్సువాడ, అక్టోబర్ 18 : ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జుక్కల్ సెగ్మెంట్ పరిధిలోని సింగూర్ -145 ఎమ్మెల్సీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రధాన పైపులైన్‌లో లీకేజీ ఏర్పడిందని తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో బాన్సువాడ, బోధన్, జుక్కల్ నియోజకవర్గాలు, ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్ మండలాల పరిధిలోని గ్రామాలకు గురువారం నుంచి శనివారం వరకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు. ప్రజలు సహకరించాలని, ఆయా గ్రామాల్లో బోరుబావులను వాడుకోవాలని కోరారు.

# బీఎల్‌వోలు పకడ్బందీగా పనిచేయాలి

**ఆర్డీవో రాజేంద్రకుమార్**


ధర్పల్లిలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రకుమార్

ధర్పల్లి/ డిచ్‌పల్లి, అక్టోబర్ 18 : ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌వోలు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఆర్డీవో, రూరల్ అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ రాజేంద్రకుమార్ అన్నారు. ధర్పల్లి మండలకేంద్రంలోని దుబ్బాక రోడ్డులో ఉన్న రైతువేదికలో ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాలకు చెందిన బీఎల్‌వోలు, రూరల్ నియోజకవర్గ పరిధిలోని డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ రూరల్, మోపాల్ మండలాల బీఎల్‌వోలకు నడ్పల్లి రైతువేదిక భవనంలో బుధవారం సమావేశం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఈ సారి 80 సంవత్సరాలు నిండిన వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సద్వినియోగం చేసుకునే వారికి బీఎల్‌వోలు అవకాశం కల్పించాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు చేపట్టాల్సిన చర్యలు, దరఖాస్తు ఫారం నింపే విధానం, ఫారం 12-డీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బ్యానర్లు, పోస్టర్లను తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.